క్లుప్తంగా

పిల్లల భవితకు బాలకృష్ణ భరోసా



డాక్టర్ బాలకృష్ణను సత్కరిస్తున్న చేయూత ప్రతినిధులు

బోట్‌క్లబ్: చేయూత సంస్థలో ఆశ్రయం పొందుతున్న పిల్లలకు రోటరీ బ్లడ్‌బ్యాంకు చైర్మన్ డాక్టర్ టీవీ బాలకృష్ణ అందించిన సహకారం మరువలేనిదని సంస్థ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. చేయూత సంస్థకు రోటరీ బ్లడ్‌బ్యాంకుకు చెందిన ప్రత్యేక భవనాన్ని అందించినందుకు కృతజ్ఞతగా శనివారం ఆయనను సత్కరించారు. సభ్యుల ఆశయాల మేరకు తప్పక కృషి చేస్తామన్నారు. బాలకృష్ణ మాట్లాడుతూ పిల్లల భద్రతకు చేయూత సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. బ్లడ్ బ్యాంకు కార్యదర్శి చార్మినార్ వర్మ, సభ్యులు ధనసాగర్ ప్రసాద్, చేయూత సంస్థ కార్యదర్శి ఆలీమ్, సభ్యులు నారాయణ మూర్తి, బాషా పాల్గొన్నారు.

'చేయూత' సేవలు అభినందనీయం



చిన్నారులకు ట్రైసైకిల్ అందజేసిన ఎంఈఓ

కరప: మానవ సేవే మాధవసేవ అంటారు, దీనిని ఆచరణలో చూపుతున్న చేయూత స్వచ్ఛంద సంస్థ సేవాకార్యక్రమాలు అభినందనీయమని ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి అన్నారు. మండలం జి.భావారం గ్రామంలో శనివారం నిరుపేద కుటుంబానికి చెందిన ప్రత్యేకావసరాలు గల ఊబా ధర్మతేజ, భానుప్రకాష్ ఉపయోగించుకునేందుకు సంస్థ ద్వారా దాతలు వీఎస్ పద్మజ, బి.సత్యవతి సమకూర్చిన మూడుచక్రాల సైకిలు, కిరాణా సామగ్రి, దుస్తులను తల్లి మాధురికి ఎంఈఓ కృష్ణవేణి అందజేశారు. ఉపాధ్యాయులు కె.వీర్రాజు, సూర్యానందకుమారి, కేవీ రమణి, వీవీ రమణ, జె.సత్యనారాయణ, సీఆర్పీ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

'మార్ని'కి భారత్ బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం



పురస్కారాన్ని అందుకుంటున్న జానకిరామచౌదరి

కాకినాడ కల్చరల్: కాకినాడకు చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త మార్ని జానకిరామచౌదరి శతాబ్దాల నాటి పురాతన నాణాలతో పాటు 210 దేశాలకు చెందిన కరెన్సీ నోట్లను సేకరించారు. ఈ సందర్భంగా భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆంధ్ర బుక్ ఆఫ్ రికార్డ్స్ చీఫ్ ఎడిటర్లు కె.అన్నపూర్ణ, సీఎస్ రావు కలెక్షన్ రేర్ నోట్స్ విభాగంలో మార్నికి స్థానం కల్పించారు. ఈ మేరకు సంబంధిత ధ్రువపత్రాన్ని రావులపాలెంలో సీఆర్‌సీ కాటన్ పరిషత్ నందు శుక్రవారం ప్రముఖ నటులు తనికెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్ చేతుల మీదుగా అందజేశారు. నగర ప్రముఖులు మార్నిని అభినందించారు.

యండమూరు వెంకన్నకు ప్రత్యేకపూజలు



యండమూరు వెంకన్నను దర్శించుకుంటున్న పెదకొత్తూరు భక్తులు

కరప: మండలం యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం ప్రత్యేక పూజలు చేశారు. పెదకొత్తూరు మాజీసర్పంచ్ చింతా దుర్గాశ్రీ మరో పదిమంది మహిళలు కాలినడకన యండమూరు వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి పూజలుచేసి, మొక్కులు తీర్చుకున్నారు. యండమూరు వెంకన్నబాబు ఆలయం పురాతనమైనదని, స్వామివారిని దర్శించుకుని, మొక్కుకుంటే, కోరినకోర్కెలు తీరతాయని అర్చకుడు సీతారామం తెలిపారు.

జనసేన సామాజిక చైతన్య యాత్ర

బాలాజీచెరువు: జనసేన పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని పార్టీ నగర ఇన్‌చార్జి ముత్తా శశిధర్ పేర్కొన్నారు. పార్టీ నిర్వహిస్తున్న సామాజిక చైతన్య యాత్రలో భాగంగా శనివారం 20వ డివిజన్‌లో బస్వాని నాగబాబు ఆధ్వర్యంలో సందర్శించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని పార్టీ సిద్ధాంతాలు వివరించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు సంగిశెట్టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముందు తరాలూ మురిసేలా
మన్నికైన ఇళ్లు

- గృహ నిర్మాణ సామగ్రి నాణ్యత పరిశీలనకు ల్యాబ్‌లు
- అధికారులు అనుమతించాకే నిర్మాణానికి ఇటుకలు, కంకర
- జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల హర్షం



కాకినాడ: కొన్ని తరాల పాటు ఎటువంటి భయం, ఆందోళనా లేకుండా ధైర్యంగా నివసించేలా నాణ్యతలో ఎటువంటి సమస్యా రాకుండా పేదలు సుఖ సంతోషాలతో జీవించాలనే లక్ష్యంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి నవరత్న పథకాల్లో భాగంగా అందరికీ ఇళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇళ్లలో నాణ్యతా లోపాలు తలెత్తకుండా లే అవుట్ల ప్రాంగణంలోనే క్వాలిటీ కంట్రోల్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. కాకినాడ వాసులకు కేటాయించిన కొమరగిరి లేఅవుట్‌లో ప్రత్యేకంగా గృహ నిర్మాణ సామగ్రి నాణ్యతను నిర్ధారించే ల్యాబ్‌ను నెలకొల్పి చురుగ్గా పనులు చేయిస్తున్నారు.

లేఅవుట్‌లోనే ల్యాబ్..

జిల్లాలోనే అతి పెద్ద లేఅవుట్ కొమరగిరిలో 16,905 మంది లబ్ధిదారుల్లో సుమారు 16,657 మంది కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్లు నిర్మించుకునేందుకు సంసిద్ధత తెలిపారు. ఇప్పటికే 4800 ఇళ్లు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయి. జీఎ న్ఆర్ కనస్ట్రక్షన్స్, ఐషాన్ కనస్ట్రక్షన్‌తో పాటు ఎంతో మంది కాంట్రాక్టర్లు ఇక్కడ ఇళ్లు నిర్మించారు. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చే కంకర, ఇసుక, మట్టి నాణ్యతను పరిశీలించి అనుమతులు వచ్చాకే ఇళ్లు నిర్మిస్తున్నారు. ఏఈ విజ్ఞేష్ ఖన్నా, ఎమినిటీ సెక్రటరీ నూకరాజు ఈ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్నారు.

నాణ్యతపై నిర్ధారణ..

ఇటుకల నాణ్యతకు కంప్రెసివ్ స్ట్రెస్ టెస్టింగ్ మిషన్‌ను ఇక్కడ ఏర్పాటు చేసి నిర్దేశిత బరువు, సామర్థ్యాన్ని, ఇసుకలో మట్టిశాతం, కంకరలో సీవ్ అనాలసిస్ పరీక్షించాకే అనుమతిస్తున్నారు. కాంక్రీట్ కోసం క్యూబ్ టెస్టింగ్ ద్వారా నిర్ధారణ చేస్తున్నారు.

తొలిసారిగా ఏర్పాటు

నాణ్యత నిర్ధారణకు ఒకప్పుడు జేఎన్‌టీయూ వంటి ల్యాబ్‌లకు పంపేవారు. ఇక్కడి లేఅవుట్ పెద్దది కావడం వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండడంతో ఇక్కడే టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి, ఇంకా అవసరమైతే ఇతర ప్రాంతాల నుంచి కూడా ఇక్కడి నాణ్యతను నిర్ధారించుకునే వెసులు బాటు కల్పిస్తున్నారు. ఈ ప్రక్రియలపై అధికారుల పర్యవేక్షణ కూడా ఉండడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన క్వాలిటీ కంట్రోల్ టెస్టింగ్ ల్యాబ్

నాణ్యత కోసమే..



భవన నిర్మాణ సామాగ్రి నాణ్యతను పూర్తిస్థాయిలో నిర్ధారించేందుకే ప్రభుత్వం ల్యాబ్ ఏర్పాటు చేసింది. ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యత ధ్రువీకరణ కాకపోతే ఏ సామగ్రినైనా తిరస్కరిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లోను నాణ్యమైన ఇళ్లను నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

– కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, హౌసింగ్ డీఈ



ల్యాబ్‌లోని పరికరాలు

చురుగ్గా గృహ నిర్మాణాలు

కాకినాడ: హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు వివిధ శాఖల అధికారులతో కలసి కొమరగిరి లే అవుట్‌ను సందర్శించారు. ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటు, స్థానికంగా మౌలిక వసతులు అందుతున్నందున ఇళ్ల నిర్మాణాన్ని మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడచిన ఏడాదితో పోలిస్తే ఇళ్ల నిర్మాణం వేగవంతమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.1.8 లక్షల తోడ్పాటు, స్వయం సహాయక సంఘాల సభ్యులుగా ఉన్న లబ్ధిదారులకు రూ.35వేలు చొప్పున సహకారం అందుతున్నారు. అలాగే టిడ్కో లబ్ధిదారులకు రూ.25వేల నుంచి రూ.లక్ష వరకు సొమ్ము అందుబాటులో ఉందని చెప్పారు. ఇళ్ల వద్ద అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని, అందువల్ల లబ్ధిదారులు చొరవ చేసి త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. హౌసింగ్ డీఈ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన ఇళ్ల నిర్మాణాలు జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు.

లబ్ధిదారుల సొమ్ముపై దృష్టిపెట్టండి

అందరికీ ఇళ్లు పథకంలో లబ్ధిదారులు చెల్లించాల్సిన వాటా సొమ్ము సకాలంలో సమకూర్చుకోవాలని ప్రత్యేకాధికారులకు ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు సూచించారు. శనివారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ, ప్రత్యేకాధికారులతో ఈ అంశంపై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణానికి సుముఖంగా ఉన్న లబ్ధిదారులను గుర్తించి అగ్రిమెంట్లు తీసుకోవడంతో పాటు రూ.35 వేల బ్యాంకు లింకేజీ వేగంగా సమకూరేలా దృష్టిపెట్టాలన్నారు. గృహనిర్మాణశాఖ ఈఈ గుప్త, డీఈ సత్యనారాయణరెడ్డి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ప్రత్యేకాధికారులు ఉన్నారు.

విశ్రాంత కమిషనర్‌కు సంతాపం..

నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.గోవిందస్వామి ఆకస్మిక మృతిపై నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన సేవలను గుర్తు చేసుకుని నివాళులు అర్పించారు.



కొమరగిరి లే అవుట్‌లో గృహనిర్మాణాలను పర్యవేక్షిస్తున్న ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, అధికారులు

చినుకు పడితే ముంపే



వర్షపు నీటితో నిండిన ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని రహదారి

కాకినాడ రూరల్: కొద్దిపాటి వర్షానికే మండల పరిషత్ కార్యాలయ మార్గం మునిగిపోతోంది. సిమెంట్ రోడ్డు అయినప్పటికీ మోకాలు లోతు నీరు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పడిన వర్షానికి కొన్ని గంటల పాటు నీరు ఇలా నిలిచిపోయింది. పక్కా డ్రైనేజీతో నీరు పోయే మార్గం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్లినికల్ ల్యాబ్‌కు రూ.2 లక్షల విరాళం



బాలకృష్ణకు విరాళం అందజేస్తున్న కాశిన దంపతులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పేద, మధ్య తరగతి వర్గాల వారికి నామ మాత్రపు రుసుముతో అన్ని రకాల వైద్య పరీక్షల నిర్వహణకు నిర్మిస్తున్న డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ నిర్మాణానికి ఎంఎస్ఎన్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు కాశిన వెంకటేశ్వరరావు సూర్యకాంతం దంపతులు రూ.2 లక్షల విరాళం అందజేసారు. శనివారం బాదం బాలకృష్ణకు దేవాలయం వీధి ట్రస్ట్ కార్యాలయంలో ఈ మొత్తాన్ని అందజేశారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు దేవకి



నాగమల్లితోట జంక్షన్: రాజస్థాన్‌లో ఈ నెల 27 నుంచి జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు కాకినాడకు చెందిన పసగాడి దేవకి ఎంపికైంది. ఈ నెల 10, 11 తేదీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సబ్ జూనియర్స్, క్యాడెట్ విభాగంలో పాల్గొని దేవకి స్వర్ణ పతకం సాధించింది. స్థానిక రామకృష్ణా స్కూల్‌లో 9వ తరగతి చదువుతుంది. దేవకిని జిల్లా తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు, పాఠశాల కరస్పాండెంట్ కేఎస్ఎస్ వర్మ, సమితి అధ్యక్షుడు వీఎల్ గాంధీ, కార్యదర్శి మహాలక్ష్మి, ఉపాధ్యక్షుడు బొత్సా శ్రీశైలం, పాఠశాల హెచ్ఎం శనివారం అభినందించారు.

ఎస్సీ హోదా తీర్మానం హర్షణీయం

కాకినాడ: దళిత క్రైస్తవులకు ఆర్థిక సామాజిక న్యాయం చేసే దిశగా ఎస్సీ హోదా కల్పించాలన్న అసెంబ్లీ తీర్మానంపై సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బీహెచ్‌వీ మూర్తిరాజు హర్షం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీవైఎఫ్ ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ మోజెస్ కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరు కెనాల్‌లో యువకుడి మృతి

కాకినాడ రూరల్: మండలంలోని కొవ్వూరు లాకుల వద్ద మెయిన్ కెనాల్ పడి జగన్నాథపురం గ్రామానికి చెందిన యువకుడు కూరాకుల శ్రీనివాసరావు (22)శనివారం మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొవ్వూరు లాకుల వద్ద స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ మెయిన్ కెనాల్‌లో జారిపోవడంతో శ్రీనివాసరావు మునిగిపోయి మృతి చెందాడు. మృతుడి సోదరుడు వీర వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టు రైతులకు నాబార్డు సేవలు

పిఠాపురం: పట్టు రైతులు సంఘాలుగా ఏర్పడడం ద్వారా నాబార్డు సేవలను వినియోగించుకోవచ్చని నాబార్డు డీడీఎం డాక్టర్ వైఎస్ నాయుడు అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పట్టుగూళ్ల సాగును శనివారం పరిశీలించారు. సాగు సంబంధించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టు రైతులు సంఘాలుగా ఏర్పడడం ద్వారా నాబార్డు నుంచి వచ్చే సబ్సిడీతో వివిధ రకాల పట్టు సాగు సామగ్రి పొందవచ్చన్నారు. నాబార్డు ఆర్థిక సాయంతో విజ్ఞానయాత్రకు వెళ్లే అవకాశం కూడా కల్పిస్తామని ఆయన తెలిపారు. గతంలో చేబ్రోలులో నాబార్డు నిధులతో నిర్మించిన మార్కెట్ షెడ్ సగం మాత్రమే పూర్తి కావడంతో దానిని పూర్తిచేసి మరిన్ని షెడ్లు నిర్మించాలని రైతులు ఆయనను కోరారు.

ఆకట్టుకొన్న వీణ కచేరీ



కచేరీలో వీణ వాయిస్తున్న అంజలి తదితరులు

కాకినాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసురాలు ఎస్.అంజలి (చెన్నై) వీణపై పలికించిన కృతులు అలరించాయి. సరస్వతీ గానసభ 19వ వార్షిక సంగీత, నృత్య నాటకోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం వీణపై ఆమె వినిపించిన కృతులు శ్రోతలను అలరించాయి. ఈమె నట్టకురంజిని వర్ణంతో వీణ కచేరీ ప్రారంభించారు. ఖరహరప్రియ రాగంలో 'ఒకపరి ఒకపరి వయ్యారమే..' తదితర కీర్తనలు వీణపై పలికించి అలరించారు. ఈమెకు మృదంగంలో అశ్విని, ఘటం ద్వారాఎస్.హనుమంతురావు సంగీత సహకారం అందజేశారు. గానసభ అధ్యక్షుడు ఆంజనేయమూర్తి, కార్యదర్శి పి.రామకృష్ణ, విశ్వనాథ్, సీతాపతిరావు, వెంకట్రావు తదితరులు హాజరయ్యారు.

పెంటాథ్లాన్‌ను ప్రోత్సహించాలి

- రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వరరావు
- మంత్రి రోజాకు వినతి సమర్పణ



మంత్రి రోజాకు వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ వేంకటేశ్వరరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): క్రీడలలో భాగమైన పెంటాథ్లాన్‌ను ప్రోత్సహించాలని ఆ క్రీడ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వేంకటేశ్వరరావు రాష్ట్ర సాంస్కృతిక, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజాను కోరుతూ వినతిపత్రం అందజేశారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన క్రీడా సంఘాల సమన్వయ సభలో పాల్గొని ఈ క్రీడను జీవో నెంబర్ 74లో చేర్చాలని, అలాగే అవసరమైన లేసర్ గన్లతో పాటు పోటీలలో పాల్గొనే సమయంలో ప్రయాణ ఖర్చులతో కూడిన రాయితీ ఇవ్వాలని కోరారు. మంత్రి రోజాతో పాటు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికు వినతిపత్రం అందజేశారు.

సబ్సిడీకి దరఖాస్తుల ఆహ్వానం

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సునీత

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అమృత్ జలధార పథకం (ఏజేఎస్) కింద సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ రైతులకు ఆ కార్పొరేషన్ ఈడీ డీఎస్ సునీత పిలుపునిచ్చారు. నీటి వసతులు లేని షెడ్యూల్డ్ కులాల రైతుల భూములకు నీటి వసతి కల్పించేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు ద్వారా రుణాలు పొందిన రైతులకు 50 శాతం, లేదా రూ.50 వేలు మించకుండా సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందని సునీత శనివారం తెలిపారు. ఈ పథకానికి 2.5 ఎకరాల భూమి ఒకరికి గాని, లేదా ఐదుగురికి కలిపి గ్రూపుగా ఉన్న రైతులు అర్హులన్నారు. వీరి వార్షిక ఆదాయం రూ.3 లక్షల మించి ఉండరాదన్నారు. బోర్ వెల్స్ లేదా సర్ఫేస్ ఇరిగేషన్, డ్రిప్ లేదా స్ప్రింక్లర్ ఇరిగేషన్ కింద రుణాలు పొందిన లబ్ధిదారులు మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. సంబంధిత ధ్రువపత్రాలను (కులం, ఆదాయం, తెలుపు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాస్‌బుక్‌లను) జిరాక్స్ కాపీలతో పాటు 2022–23 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు నుంచి రుణం పొందినట్టు నిర్ధారిస్తూ సంబంధిత బ్యాంకు మేనేజర్ జారీ చేసిన ధ్రువపత్రాలను జత చేయాలని ఈడీ వివరించారు. మరో పథకమైన యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ పథకం (వైఈఎస్) కింద షెడ్యూల్డ్ కులాల వారు రుణం పొంది ఉంటే వారికి రుణంలో 50 శాతం లేదా రూ.60 వేలు సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. వైఈఎస్ పథకం ద్వారా స్వయం ఉపాధి కింద ట్రాక్టర్, ట్రాలీ, కమర్షియల్ వాహనాలు, వేర్‌హౌస్, గోదాముల రవాణాకు ఉపయోగపడే వాహనాలకు 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే బ్యాంకు రుణం పొంది ఉండాలన్నారు. వీరి వార్షిక ఆదాయం రూ. 3 లక్షలు మించరాదన్నారు. సంబంధిత ధ్రువపత్రాలను జత చేయాలన్నారు. సంబంధిత దరఖాస్తులను సంబంధిత మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఈడీ వివరించారు.

ఉత్సాహంగా మహిళా దినోత్సవ క్రీడలు



శ్రీనగర్‌లోని తైక్వాండో శిక్షణ కేంద్రంలో మహిళలతో చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్: కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న క్రీడలు శనివారంతో ముగిశాయి. శనివారం స్థానిక శ్రీనగర్‌లోని తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రంలో క్రీడాకారిణులకు, వారి తల్లులకు ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం డీఎస్ఏలో మ్యూజికల్ చైర్స్, యోగా పోటీలు జరిగాయి. పోటీలలో విజేతలకు చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ బహుమతులు అందజేశారు. డీఎస్ఏలో కోచ్‌లు, క్రీడాకారిణులు పాల్గొన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాకినాడ: కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక రాహుల్‌గాంధీపై తప్పుడు కేసులతో అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతలు శనివారం మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ కార్యాలయం నుంచి కల్పనా సెంటర్ వరకు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా రాహుల్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని నినదించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి నులుకుర్తి వెంకటేశ్వరరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు, పీసీసీ సభ్యులు ఆకుల వెంకటరమణ, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

గుండె సంబంధ ఆధునిక చికిత్సపై ముగిసిన శిక్షణ

కాకినాడ: కాకినాడ జీజీహెచ్‌లోని స్కిల్ ల్యాబ్‌లో నిర్వహించిన అమెరికన్ హార్ట్ అసోసియేషన్ అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్టు మూడు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. అనస్థీషియా వైద్య విభాగం సహా మెడిసిన్ వైద్యులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. కార్డియాక్ రిసక్సియేషన్‌లో అమెరిన్ హార్ట్ అసోసియేషన్ మార్గదర్శకాలను మిళితం చేస్తూ ఇన్‌స్ట్రక్టర్ డాక్టర్ అఖిల్ బృందం ఈ శిక్షణ ఇచ్చారు. శనివారం రాత్రి నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవి మాధవి సహా ఇతర బోధకులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి వీరంగం

- రైల్వే స్టేషన్‌లో రెండు టీవీల ధ్వంసం
- ప్రయాణికులపై రాళ్లతో దాడి
- అదుపులోకి తీసుకున్న ఆర్పీఎఫ్ సిబ్బంది



పోలీసుల అదుపులో ఉన్న ఒడిశా యువకుడు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఒడిస్సాకు చెందిన ఒక వ్యక్తి వీరంగం సృష్టించడంతో ప్రయాణికులు హడలిపోయి పరుగులు తీశారు. శనివారం రైల్వే స్టేషన్ ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన రెండు టీవీలను ధ్వంసం చేసి అడ్డు వచ్చిన వారిపై రాళ్లతో దాడి చేయడం తో ప్రయాణికులు పరుగులు తీశారు. దాంతో స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ సమాచారం మేరకు ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మతిస్థిమితం లేక పోవడం వల్లే ఇలా ప్రవర్తిస్తున్నట్లు రైల్వే అధికారులు గుర్తించారు. ఈ వ్యక్తిని ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ స్టేషన్‌లో ఉంచినట్టు మేనేజరు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కాకినాడ: మద్యం మత్తులో కాకినాడలో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కాకినాడ రామారావు పేట చీడీలపోరకు చెందిన బొమ్మదేవర వీరబాబు(36) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి అలవాటు పడి అప్పులపాలయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్యపై అలిగి..

కాకినాడ: భార్యపై అలిగిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే నగరంలోని జగన్నాథపురానికి చెందిన కాటం శ్రీను (34) భార్య తన అన్నయ్య ఇంటికి వెళ్లింది. మనస్పర్థల నేపథ్యంలో ఇంటికి రమ్మంటే విముఖత చూపింది. దీంతో భార్యపై అలిగిన శ్రీను ఇంట్లోని రెండో అంతస్తులో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి కాటం సరస్వతి ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆపద మిత్రలకు ముగిసిన శిక్షణ



ఆపద మిత్రలకు సర్టిఫికెట్లు అందజేసిన ప్రిన్సిపాల్

సామర్లకోట: ప్రకృతి వైపరీత్యాల వేళల్లో బాధితులకు సాయం అందించడానికి ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాకు చెందిన ఆపదమిత్రల శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 12 రోజుల పాటు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పొందిన శిక్షణపై ఆపదమిత్రల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విపత్తుల సమయాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే కీలకం అన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని సకాలంలో స్పందించి ప్రాణనష్టం లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆపద మిత్రలకు రూ.15 వేలు విలువ చేసే కిట్లను అందజేశారు. ఈ కిట్లలో ఉన్న 16 రకాల పరికరాలు ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్, విపత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు మేనేజరు కిరణ్మయి, ఈటీసీ ఫ్యాకల్టీలు, కేఆర్ నిహారిక, వి.ప్రసాద్, ఎస్‌కే మోహిద్దీన్ పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, ఉత్తమ శిక్షణ పొందిన వారికి మెమెంటోలు అందజేశారు.